ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

3
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శనివారం 13 జూలై 2024



సుగుణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వర్ధన్నపేటలో కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడిన కల్లెం విజయ్

రక్తచరిత్ర

ఓరుగల్లును వణికిస్తున్న హత్యలు

పాత కక్షలు బుసలు కొడుతున్నాయి..
ప్రేమ ఉన్మాదంగా మారుతోంది..
బంధాలు ఉరి తాళ్లవుతున్నాయి..
ఓరుగల్లు రక్తసిక్తం అవుతోంది...

వరుస హత్యలు.. కత్తుల దాడులతో ప్రజలు భీతిల్లుతున్నారు. కట్టుకున్నోడే కాలయముడై కత్తులతో దాడి చేస్తే... ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయి దక్కలేదని ప్రేమికుడు ఉన్మాదానికి దిగితే.. ప్రాణాలు గాలిలో దీపంలా ఆరిపోతున్నాయి. ఏ క్షణాన.. ఏం జరుగుతుందో అనే భయం నీడలో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హత్యల సంస్కృతి పెరిగి పోతుండటం ఓరుగల్లువాసులను కలవరానికి గురి చేస్తోంది. పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నా.. క్షణికావేశంతో చేస్తున్న హత్యలతో కాకతీయ గడ్డ నెత్తురోడుతోంది.

- ఖూనీలకు దారితీస్తున్న క్షణికావేశాలు
- కనుమరుగవుతున్న మానవ సంబంధాలు
- ప్రేమ, భూమి, మనస్పర్థలే కారణాలు
- రెండు నెలల్లో పెరిగిపోయిన నేర ప్రవృత్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరుస హత్యలు, దాడులతో వరంగల్ ఉమ్మడి జిల్లా వణికిపోతోంది. ప్రశాంతంగా ఉండే ఓరుగల్లు ప్రాంతంలో రెండు నెలలుగా వరుసగా జరుగుతున్న హత్యలతో ప్రజల్లో భయాందోళన వ్యక్తం అవుతోంది. ప్రధానంగా బంధాలు, బంధుత్వాలు మరిచి సొంతవారినే హతమారు స్తున్న ఘటనలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారు తున్నాయి. చిన్న చిన్న విషయాలకు క్షణికావేశాలకు గురై హత్యలకు పాల్పడుతున్నారు. మానవ సంబంధాలు మరిచి మృగాలుగా ఆలోచిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విచ్చలవిడిగా లభిస్తున్న గంజాయి, డ్రగ్స్, మద్యం కూడా నేర ప్రవృత్తిని పెంచేందుకు దోహదపడుతోందనే చర్చ జరుగుతోంది.

తాజాగా శుక్రవారం సాయంత్రం వర్ధన్నపేట మండలం ఇల్లందు గ్రామానికి చెందిన ఊర కృష్ణ పాత కక్షలతో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కల్లెం విజయ్‌పై కత్తితో దాడికి దిగారు. అడ్డు వచ్చిన విజయ్ మిత్రుడు రాజ్‌కుమార్‌కు కూడా కత్తి గాయాలయ్యాయి. ఇద్దరు కూడా ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో ఎంజీఎంకు చికిత్స నిమిత్తం తరలించారు. కృష్ణ కుమార్తెను విజయ్ ప్రేమించినట్లుగా స్థానికులు పేర్కొంటున్నారు. అయితే పెద్దమనుషులు విజయ్‌ని మందలించి, అమ్మాయిని మరిచిపోవాలని హెచ్చరిస్తూ రూ.50వేల జరిమానా విధించారు. ఇదే విషయంపై కృష్ణ - విజయ్‌ల మధ్య వివాదం ఉండగా, వన భోజనాల అనంతరం ఇద్దరి మధ్య జరిగిన గొడవ.. కత్తిపోట్ల వరకు వెళ్లింది. అలాగే శుక్రవారం గీసుకొండ మండలం జాన్‌పాక వద్ద రవి అనే వలస కూలీని గుర్తుతెలియని వ్యక్తులు తలపై దాడి చేసి హతమార్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రవిపై ఎవరు దాడి చేసి హతమార్చారు..? ఎందుకు హత్య చేశారో? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒకే రోజు రెండు సంఘటనలు జరగటం కలకలం రేపుతోంది.


ఎల్లంబజార్‌లో బండరాయితో కొట్టడంతో మృతిచెందిన వీరభద్రాచారి

భార్య దక్కలేదని..

జూలై 11వ తేదీ గురువారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల 16 చింతల తండాకు చెందిన దీపిక అనే అమ్మాయిని నాగరాజు ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్ల తరువాత నాగరాజుతో ఉండలేక దీపిక తన పుట్టింటికి వచ్చేసింది. అయితే దీపిక తనతో కాపురానికి రావటం లేదని నాగరాజు అమ్మాయి ఇంటిపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనలో ఆరు బయట నిద్రిస్తున్న అమ్మాయి తల్లితండ్రులు బానోతు శ్రీనివాస్, సుగుణలను కత్తి దాడి చేసి హత్య చేశాడు. తనకు ఎదురుగా వచ్చిన దీపికతో పాటు మదన్‌లాల్‌పై దాడికి పాల్పడి పరారయ్యారు. శుక్రవారం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. భార్య కాపురానికి రాకపోతే పోలీస్‌స్టేషన్, కోర్టు, లేదంటే పెద్ద మనుషుల సమక్షంలో తేల్చుకోకుండా ఉన్మాదిగా మారి ఇద్దరి ప్రాణాలు తీయటం రాష్ట్రవ్యాప్తంగా రేపుతోంది.

మనస్పర్థలతో..

ఈ నెల 9వ తేదీన వరంగల్‌లోని చెన్నారెడ్డి కాలనీలో మంద చరణ్, స్వప్న దంపతుల మరణం పలువురిని కలిచివేసింది. భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావటంతో భార్యను హత్య చేసి, తాను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. వీరి క్షణికావేశం

మిగతా 6వ పేజీలో..

మరికొన్ని సంఘటనలు

- జూన్ 1వ తేదీన మిల్స్‌కాలనీలోని ఓ బిర్యానీ పాయింట్ వద్ద ఒక రూపాయి విషయంలో తలెత్తిన వివాదంలో ఇసంపల్లి ప్రేమ్‌సాగర్‌ను జన్ను అరవింద్ నెట్టివేయటంతో కింద పడి తలకు గాయాలు కావటంతో ప్రేమ్‌సాగర్ అక్కడిక్కడే మృతి చెందారు.
- జూన్ 22వ తేదీన హనుమకొండ పట్టణంలోని రెవెన్యూకాలనీ నాగేంద్ర నగర్‌లో దంపతుల మధ్య గొడవతో భార్య మంజులను భర్త అశోక్ గొంతు నులిమి హతమార్చారు. ఈ కేసును మరో వ్యక్తిపై నెట్టేందుకు ప్రయత్నించగా, పోలీసుల విచారణలో అశోక్ నిందితుడిగా తేలటంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.
- జూన్ 30వ తేదీన వరంగల్ ఎల్లంబజార్ ప్రాంతానికి చెందిన వీరభద్రాచారిపై బండరాయితో దాడి చేసి పెరుకవాడకు చెందిన టి.రవీందర్ హత్య చేశారు. వ్యక్తిగత కక్షలతో హత్యకు పాల్పడ్డట్లు గుర్తించి, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు.
- జూలై 7వ తేదీన నర్సంపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో బెల్ట్ షాపు నిర్వాహకుడు షేక్ రహీంపాషా (44)ను మద్యం కోసం హత్య చేశారు.

కూతురిని ప్రేమించాడని..

- వర్ధన్నపేటలో యువకుడిపై హత్యాయత్నం
- అడ్డొచ్చిన మేనల్లుడికి గాయం
- సినిమా థియేటర్‌లో ఘటన
- భయకంపితులైన జనం

వివరాలు : 5లో..

భార్యను దక్కకుండా చేశారని కక్ష

- ప్లాన్ ప్రకారం అత్తమామల హత్య
- 16 చింతల్‌తండా జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రవీందర్

రైతులకు మెరుగైన పరిహారం

కలెక్టర్ రాహుల్‌శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 12: గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములిచ్చే రైతులకు ఎటువంటి అపోహలు వద్దని, మెరుగైన పరిహారం అందేలా కృషి చేస్తామని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో మంచిర్యాల-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణపై భూములు కోల్పోతున్న చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ చట్టం ప్రకారం రైతుల అభీష్టం మేరకు భూసేకరణ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో సింగరేణి గనుల కోసం చేపట్టిన భూసేకరణలో ఒక్కరికి కూడా అన్యాయం చేయలేదని వివరించిన కలెక్టర్ రాహుల్‌శర్మ భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు వంద శాతం చేపట్టాలి

జిల్లాలో పంటల నమోదును వంద శాతం నమోదు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ పంటల నమోదు, రైతు భరోసా, ఎరువులు, పురుగు మందులు, మట్టి నమూనాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్ లాంటి పథకాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువుల కొరత లేకుండా చూడాలని, పంటలకు, సరిపడా యూరియా, డీఏపీ, ఇతర ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే వారిపై, ఎరువులు అధిక ధరలకు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా సమస్యలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి నంబరు 7288894787ను సంప్రదించాలి సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొగత వద్ద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలు

ఏర్పాటు చేసిన సీఐ కుమార్, ఎస్సై హరీష్


జలపాతం వద్ద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వాజేడు, జూలై 12: మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం వద్ద పోలీసులు ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలను శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. వెంకటాపురం(నూగూరు) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలలో పర్యాటకులు లోతట్టు ప్రాంతానికి వెళ్లి ప్రమాదాల బారిన పడకూడదని సూచించారు. లోతట్టు ప్రాంతానికి వెళ్లి ప్రాణాలు కోల్పోవద్దని, మద్యం సేవించి జలపాతంలోకి దిగకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు ప్రతిపాదనలు అందజేయాలి

సమీక్ష సమావేశంలో కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 12: జిల్లాలో మహిళాశక్తి, మినీ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, పైలట్ ప్రాజెక్టుపై అధికారులు పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధంచేసి అందజేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం ములుగులోని కలెక్టరేట్‌లో అయన అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫుడ్ ప్రాసెసింగ్ గురించి వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకుని పనులు పూర్తిచేసే విధంగా చూడాలన్నారు. సేకరించిన సమాచారాన్ని డాటాఎంట్రీ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో భద్రపరచాలని సూచించారు. అనంతరం అవెన్యూ ప్లాంటేషన్ల గురించి ఆరా తీశారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, జిల్లాలోని ఎంపీడీవోలు, ఏపీవోలు, బ్యాంకు మేనేజర్లు, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో మధుసూదన్


పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

రేగొండ, జూలై 12 : సీజనల్ వ్యాధులు డయేరియా, డెంగీ, మలేరియా, అతిసార రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. మండలంలోని రాయపల్లి, రంగయ్యపల్లి గ్రామాల్లో ఫ్రై డే డ్రై డే సందర్భంగా శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో మధుసూదన్ పరిశీలించి మాట్లాడారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు డయేరియా బారిన పడకుండా ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలు వాడాలని అన్నారు. ప్రజలు తమ పరిసరాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హిమబింధు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- పనులు చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), జూలై 12 : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అధికారులు అంకితభావంతో ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అన్ని శాఖల పరిధిలో చేపట్టిన, చేపట్టబోయే పనుల వివరాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రోడ్లు, భవనాల నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అయినా స్పందించకుంటే పనులను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టర్లకు రెండుకు మించి పనులను కేటాయించవద్దన్నారు. రోడ్లను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు తాగునీరు అందించాలని మిషన్ భగీరథ అధికారులు సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో వైద్యం అందించాలన్నారు. కొత్తగూడ, గంగారం మండలాలు పూర్తిగా అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలని తెలిపారు. అధికారులు ఆయా మండలాలపై దృష్టి సారించి అభివృద్ధి చేయాలని సూచించారు. యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన వన మహోత్సవంలో మంత్రి సీతక్క, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఎస్పీ సుధీర్‌రామ్ నాథన్ కేకన్ మొక్కలు నాటారు. కొత్తగూడ మండలంలోని పలు రోడ్ల పనులను ఆమె ప్రారంభించారు.


కొత్తగూడలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

నెలకు రెండుసార్లు 'ప్రజాదర్బార్'

కొత్తగూడ, గంగారం మండలాల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నెలలో రెండు సార్లు ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్టు మంత్రి సీతక్క పేర్కొన్నారు. జిల్లా స్థాయి అధికారులు గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. మంత్రి సీతక్క దృష్టికి తమ సమస్యలను తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు పలు మండలాల నుంచి వందలాదిగా తరలివచ్చిన ప్రజలతో రైతు వేదిక ప్రాంతం జాతరను తలపించింది. కార్యక్రమంలో డీఎఫ్‌వో బత్తుల విశాల్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ నరేష్, ఆర్డీవో అలివేలు, మాజీ జడ్పీటీసీలు పుల్లం పుష్పలత శ్రీనివాస్, రమ, సీఈవో నర్మద, డీపీవో హరిప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

అసంతృప్తిలో అంగన్‌వాడీలు

- టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్
- జిల్లాలో 87మంది పదవీ విరమణ


కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

ములుగు రూరల్, జూలై 12: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పదవీ విరమణపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో వారు సందిగ్ధంలో పడ్డారు. జిల్లాలో 65ఏళ్లు నిండిన 17మంది అంగన్‌వాడీ టీచర్లు 70మంది ఆయాలతో కూడిన జాబితాను గత ఏప్రిల్ నెలలో అధికారులు సిద్ధం చేసి పంపించారు. అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు ఉద్యోగ విరమణ వయస్సును 65ఏళ్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. వారందరికి పదవీ విరమణ పొందే సమయంలో ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంగన్‌వాడీ టీచరుకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేలు సహాయం అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 65ఏళ్లు నిండిన వారి జాబితాను అధికారులు ప్రభుత్వానికి అందజేశారు.

జిల్లాలో 87మంది పదవీ విరమణ

జిల్లాలో 65ఏళ్ల వయస్సు నిండిన 87మంది అంగన్‌వాడీ ఉద్యోగులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో టీచర్లు 17మంది, 70మంది ఆయాలున్నారు. వీరంతా గత ఏప్రిల్ నెలాఖరు నాటికి పదవీ విరమణకు అర్హులుగా గుర్తించారు.

వయస్సు నిర్ధారణలో ఇబ్బందులు

ఉద్యోగ విరమణకు ప్రస్తుతం 87 మంది అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే వయస్సు నిర్ధారణకు సంబంధించి వారిలో అయోమయం నెలకొంది. బోనోఫైడ్, టీసీ, పదో తరగతి మార్కుల మెమో ఇలా ఏదో ఒక ధ్రువపత్రం తప్పనిసరిగా సమర్పించాలని అధికారులు సూచించారు. కాగా, టీచర్లంతా చదువుకున్న వారు కావడంతో జనన ధ్రువీకరణ, ఇతర వివరాలతో కూడిన సర్టిఫికెట్లు సిద్ధం చేసుకున్నారు. ఆయాల్లో చాలా మందికి సర్టిఫికెట్లు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. పుట్టిన తేదీ ధ్రువపత్రం లేని వారు వయస్సు నిర్ధారణ కోసం ఎముకల సాంద్రత పరీక్ష చేయించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. జిల్లా స్థాయి వైద్యాధికారితో ధ్రువపత్రం తీసుకోవాలని సూచించింది.

ఆందోళన చేసినా ఫలితం శూన్యం

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పదవీ విరమణ అనంతరం ఎలాంటి ఆర్థిక సహాయం పొందేవారు కాదు. దీంతో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ విరమణ సమయంలో టీచరుకు రూ.5లక్షలు, ఆయాలకు రూ.2లక్షలు అందజేయాలని 2023లో ఆందోళన చేపట్టారు. దీంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం టీచరుకు రూ.2లక్షలు, ఆయాకు రూ.లక్ష ఉద్యోగ విరమణ బెనిఫిట్ ప్రకటించింది. కాంగ్రెస్ సైతం కనీస వేతనం రూ.18వేలతో పాటు పలు హామీలను ఇచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల పదవీ విరమణ సమయంలో టీచరుకు రూ.లక్ష, ఆయాకు రూ.50వేలు ఇస్తామనడంతో ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఇచ్చే సాయం మరీ తక్కువగా ఉందని, కనీసం టీచరుకు రూ.2లక్షలు, ఆయాకు రూ.లక్ష చెల్లించాలని ములుగు ఎమ్మెల్యే, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిం చారు. సంబంధిత శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధు లకు వినతి పత్రాలను అందజేస్తున్నారు. కాగా, అంగన్‌వాడీలు చేస్తున్న ధర్నా శుక్రవారానికి ఏడు రోజులకు చేరుకుంది.

టీచరుకు రూ.2లక్షలు, ఆయాకు లక్ష ఇవ్వాలి

కె.సమ్మక్క, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి



అంగన్‌వాడీ టీచర్, హెల్పర్లు సగటున 30-40ఏళ్ల పాటు సేవలందించి 65ఏళ్లకు పదవీ విరమణ పొందుతున్నారు. అంతకాలం సేవలందించిన వారికి ప్రభుత్వం అత్తెసరు ఆర్థిక సాయం ఇవ్వాలనుకోవడం సరికాదు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆర్థిక ఆర్థిక సాయంలో మార్పులు చేయాలి. కనీసం అంగన్‌వాడీ టీచర్‌కు రూ.2లక్షలు, ఆయాకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయాలి.

స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం

రత్నం రాజేందర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి



అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు మెరుగైన పదవీ విరమణ ప్యాకేజీ ఇస్తామని, వేతనాలు కూడా పెంచుతామని అప్పట్లో సమ్మె చేసిన చోటుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలు హామీ ఇచ్చారు. కానీ, ఇప్పుడు పట్టించుకోవడం లేదు. టీచర్లకు రూ.18వేలు జీతం ఇస్తామని, రిటైర్మెంట్ ప్యాకేజీ రెట్టింపు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినప్పటికి అమల్లోకి రాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

కేటీపీపీ మొదటి దశలో ఓవరాలింగ్

గణపురం, జూలై 12: గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తిని అధికారులు నిలిపివేశారు. జెన్‌కో ఆదేశాల మేరకు ప్రతి ఏటా ప్రాజెక్టులో నిర్వహించే ఓవరాలింగ్ పనులను ప్రారంభించాలని ఆదేశాలు రావడంతో గురువారం రాత్రి మొదటి దశ 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ఇంజనీరింగ్ అధికారులు నిలిపివేశారు. ఇందులో భాగంగా సుమారు 20 రోజుల పాటు ప్రాజెక్టులో బాయిలర్, టర్బైన్, గ్రిడ్ విడి భాగాల, యాడ్‌ఫాండ్, వాటర్ ప్లాంట్ తదితర పనులను చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆటోలను దొంగలించిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు

బాలసముద్రం, జూలై 12: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి హంటర్‌రోడ్డులోని పద్మాక్షి గుట్ట ఏరియా ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఆటోలను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని శుక్రవారం అరెస్టు చేశారు. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం, మట్కాక్షిప్ జిల్లా, ఉప్పల్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన రమేష్ పట్నాయక్(40), అతడి స్నేహితుడైన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలానికి చెందిన వేములు సంతోష్(42)లు జల్సాలకు అలవాటుపడ్డాడు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రి సమయాల్లో దొంగతనాలకు అలవాటుపడి పార్కింగ్ చేసిన ఆటోలను దొంగిలించడం వృత్తిగా ఎంచుకున్నట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువ చేసే మూడు ఆటోలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఇద్దరు దొంగలను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.



ఇద్దరు వ్యక్తుల అరెస్టును చూపుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

రాధక్క సంతాప సభను జయప్రదం చేయాలి

కాళోజీ జంక్షన్, జూలై 12: గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నాయకురాలు రాధక్క సంతాప సభను జయప్రదం చేయాల్సిందిగా సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కోరారు. సంతాప సభను పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు సమీపంలోని రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంతాపసభకు సంబంధించిన పోస్టర్లను హనుమకొండలోని కాళోజీ సెంటర్‌లో ఆవిష్కరించారు. న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. గోవర్ధన్, ప్రగతి శీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పార్టీ ఖమ్మం, వరంగల్ ఏరియా కమిటీ మోకాళ్ల మురళీకృష్ణ, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పాల్గొంటున్నట్లు న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు తెలిపారు.



హనుమకొండ కాళోజీ సెంటర్‌లో సంతాప సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యూ డెమోక్రసీ నాయకులు

హనుమకొండలో ట్రాఫిక్ మళ్లింపు

హనుమకొండ కలెక్టరేట్, జూలై12: హనుమకొండ లోని అశోకా జంక్షన్ నుంచి హనుమకొండ బస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు మరమ్మతులు నిర్వహించేందుకు వరంగల్ గ్రేటర్ మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఈ నెల 14వ తేదీ (ఆదివారం) ఉదయం వరకు ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా ఈ మార్గాన్ని తాత్కాలికంగా మూసివేస్తామని తెలిపారు. బస్‌స్టేషన్‌కు వెళ్లాలనుకున్న వాహనదారులు ఏషియన్ మాల్, బాలసముద్రం, హనుమకొండ చౌరస్తా నుంచి బాలాంజనేయ దేవాలయం మీదుగా చేరుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంజేపీ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 12: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ఆర్‌సీవో వై. మనోహర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను నేరుగా సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్(9866610429), ములుగు (9989991703), మహబూబాబాద్ (7093003078), పాలకుర్తి (9989418015), భూపాలపల్లి (9154102635) తదితర కళాశాలల్లో అర్హతలను బట్టి వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు.

రైల్వేల అభివృద్ధి నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

కాజీపేట, జూలై 12: కాజీపేటలో రైల్వే పరిశ్రమల అభివృద్ధి, రైల్వే కార్మికుల సంక్షేమంపై శనివారం కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీ కడియం కావ్యతో పాటు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజులు హాజరుకానున్నారని చెప్పారు. సాయంత్రం 4గంటలు జరిగే ఈ సమావేశానికి రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు, లోకో పైలెట్‌లు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఇతర సంఘాలు పాల్గొని రైల్వే సమస్యలపై చర్చించాలని రాఘవేందర్ కోరారు.

మక్కలకు రికార్డు ధర

క్వింటాకు రూ. 2,645

మట్టెవాడ, జూలై 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ వరంగల్‌లో శుక్రవారం మొక్కజొన్నలకు రికార్డు ధర పలికింది. మొక్కజొన్నలకు క్వింటాల్‌కు రూ.2,645 ధర పలికింది. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చరిత్రలోనే మొక్కజొన్నలకు ఇంత ధర పలకడం ఇదే తొలిసారి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల కిందట మొక్కజొన్నలు మార్కెట్‌లో రూ.2,400 ధర పలికింది. అది క్రమంగా పెరుగుతూ శుక్రవారం రూ. 2,645కు ఎగబాకింది.

కూతురిని ప్రేమించాడని..

వర్ధన్నపేటలో యువకుడిపై హత్యాయత్నం ● అడ్డొచ్చిన మేనల్లుడికి గాయం ● సినిమా థియేటర్‌లో ఘటన



వర్ధన్నపేట థియేటర్‌లో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్య ప్రకాష్

వర్ధన్నపేట రూరల్/ వర్ధన్నపేట, జూలై 12 : భారతీయుడు - 2 సినిమా రిలీజ్ సందర్భంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలోని భారతీయ టాకీస్‌లో సాయంత్రం 6 గంటలకు ఫస్ట్ షో పడింది. సినిమా ప్రారంభమై పది నిమిషాలు కాగానే ఒక్కసారిగా హాహాకారాలు వినిపించాయి. దీంతో థియేటర్‌లో ఉన్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెనకకు చూస్తే కత్తితో ఓ యువకుడిని పొడుస్తున్న దృశ్యం. దీంతో అందరూ ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టారు. ఏం జరిగిందో తెలుసుకునే సరికి దాడిచేసిన వ్యక్తి కత్తిని అక్కడే వదిలేసి పారిపోయాడు. వర్ధన్నపేట పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

మండలంలోని ఇల్లందలో శుక్రవారం కుటుంబసభ్యులు వన భోజనాలకు వెళ్లారు. అక్కడే భోజనాలు చేసి మద్యం సేవించి సాయంకాలం భారతీయుడు-2 సినిమా చూసేందుకు దాదాపు 8మంది వర్ధన్నపేటకు వచ్చారు. థియేటర్‌లో విజయ్ ముందు సీట్లో కూర్చోగా, కృష్ణ అతడి వెనకాలే కూర్చున్నాడు. అప్పటికే కృష్ణ తన వెంట తెచ్చుకున్న కత్తితో సినిమా పడిన 10నిమిషాలకు విజయ్‌ను వెనక నుంచి మూడుసార్లు పొడిచారు. అరుస్తూ వెనక్కి తిరగ్గా పొట్టలో మరోసారి పొడిచి, కత్తి అక్కడే పడేసి బయటకు వెళ్లిపోయాడు. దాడి సమయంలో అడ్డుపడిన కృష్ణ అక్క కుమారుడు గంధం రాజ్‌కుమార్‌కు సైతం కత్తి పోటు పడింది. విజయ్‌తో వచ్చిన వాళ్లు వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరం గల్ ఎంజీఎంకు తరలించారు.

ప్రేమ వ్యవహారమే కారణమా?

ఇల్లందకు చెందిన ఊర కృష్ణ ఓల్డ్ ఐరన్ (పాత ఇనుమ సామగ్రి) షాపు నడిపించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన సోదరుడు ఊర రాజ్ కుమార్ సైతం వర్ధన్నపేట పట్టణంలో ఓల్డ్ ఐరన్ షాపు వ్యాపారం చేస్తున్నాడు. రాజ్‌కుమార్ వద్ద మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని అమ్మాపురంనకు చెందిన యువకుడు కల్లెం విజయ్ పనిలో చేరాడు. విజయ్ ఇల్లందలోనే ఉంటూ షాపును చూసుకుంటున్నాడు. కొన్ని నెలల కిందట కృష్ణ కూతురిని ప్రేమించిన విషయంలో విజయ్‌తో గొడవలు జరగగా, వారి సామాజిక వర్గంలో(బుడగ జంగాలు) పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకున్నారు. విజయ్‌దే తప్పని తేల్చి అతడికి దాదాపు రూ.50వేల వరకు జరిమానా విధించారు. దీంతో గొడవ సద్దుమణిగింది. విజయ్ కూడా తనపని తీను యథావిధిగా చేసుకుంటున్నాడు. కానీ తన కూతురుని ప్రేమించిన విషయాన్ని కృష్ణ మనసులో పెట్టుకుని కక్ష పెంచుకున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో శుక్రవారం కృష్ణ కుటుంబంతో పాటు సోదరుడు రాజ్‌కుమార్ కుటుంబం కూడా వనభోజనానికి వచ్చింది. వారితోపాటే కల్లెం విజయ్ కూడా వచ్చాడు. సాయంత్రం అంతాకలిసి సినిమాకు ప్లాన్ చేసుకున్నారు. ఇదే అదునుగా భావించిన కృష్ణ.. వారితోపాటే సినిమాకు వస్తూ వెంట కత్తిని తెచ్చుకున్నాడు. థియేటర్‌లో విజయ్ వెనకాలే కూర్చొని కత్తితో దాడి చేశాడు.

సమాచారం అందుకున్న వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ సూర్య ప్రకాష్‌లు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడి జరిగిన పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో మొబైల్, దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వర్ధన్నపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంధం రాజ్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు. గాయాలైన కుటుంబసభ్యులు ఫిర్యాదు అందిన తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.



నిందితుడు కృష్ణ (ఫైల్)



బాధితుడు విజయ్ (ఫైల్)



చికిత్స పొందుతున్న గంధం రాజ్‌కుమార్

నేటి నుంచి ప్యాసింజర్ ప్రారంభం


డోర్నకల్, జూలై 12: విజయవాడ - డోర్నకల్ - భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్ - డోర్నకల్ - విజయవాడ స్టేషన్ల మధ్య నడిచే (07979/07278) ప్యాసింజర్ రైలును శనివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసినట్లు డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు షైనూపాష తెలిపారు. గతనెల 27న దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) డోర్నకల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించిన సమయంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లామని వివరించారు. దీంతో స్పందించిన డీఆర్ఎం రైలు పునరుద్దరణకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్యాసింజర్ రైలు పునరుద్ధరణ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల షైనూపాషా రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్

భార్యను దక్కకుండా చేశారని కక్ష

- ప్లాన్ ప్రకారం అత్తమామల హత్య
- 16 చింతల్‌తండా జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీసీపీ రవీందర్



నిందితుడు నాగరాజు (ఫైల్)

నర్సంపేట టౌన్, జూలై 12: ప్రేమించి పెళ్లి చేసుకుంటే అత్తమామలు భార్యను తనకు కాకుండా చేశారనే కక్షకట్టి అత్తమామలపై నిందితుడు నాగరాజు దాడి చేసి హత్య చేసినట్టు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట పోలీసులు అరెస్టు చేయగా, వరంగల్ డీసీపీ విలేకరుల సమావేశంలో ఘటన వివరాలను వెల్లడించారు.

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ మేకల నాగరాజు అలియాస్ బన్నీకి చెన్నారావుపేట మండలం 16 చింతల్‌తండాకు చెందిన బానోతు దీపిక స్కూల్‌కు వెళ్లే సందర్భంలో (ఐదేళ్ల కిందట) పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. 2023 అక్టోబరులో నాగరాజు, దీపికలు హైదరాబాద్‌కు వెళ్లి నవంబరులో జగదిగిరిగుట్ట వద్ద వివాహం చేసుకున్నారు. ఈ విషయంపై దీపిక తల్లిదండ్రులు హనుమకొండలోని సుబేదారిలో పోలీస్ స్టేషనలో అదేరోజు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు వారిద్దరిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పుడు దీపిక నాగరాజుతో పాటు వెళ్లింది. కొంతకాలం హైదరాబాద్‌లో ఉండగా, ఇటీవల భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు జరగగా, నాగరాజుతో ఉండలేనని దీపిక తన తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. అప్పటి నుంచి దీపిక పుట్టింట్లోనే ఉంటోంది. అయితే తన భార్యను తన వద్దకు రాకపోగా, ఆమె తల్లిదండ్రులు తమను వేరు చేస్తున్నారన్న కక్షను పెంచుకున్న నాగరాజు.. వారిని ఎలాగైనా చంపాలని భావించాడు. హైదరాబాద్ నుంచి 5నెలల కిందట గుండెంగకు చేరుకొని ఆటో కిరాయి తీసుకొని నడుపుకుంటున్నాడు. నెల కిందట నెక్కొండలో అంబేద్కర్ సెంటర్ వద్ద కత్తులు అమ్ముతున్న వ్యక్తి వద్ద పదునైన పొడవాటి కత్తిని కొనుగోలు చేశాడు. 16 చింతల్‌తండాకు రెండు, మూడు పర్యాయాలు వెళ్లి దీపిక ఇంటి వద్ద రెక్కీ నిర్వహించాడు.

ఈనెల 11న రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో నాగరాజు తన తాత వద్ద టీవీఎస్ ఎక్సెల్ వాహనం తీసుకొని 16 చింతల్‌తండాకు చేరుకున్నాడు. దీపిక ఇంటి వద్దకు చేరుకున్న నాగరాజు.. ఇంటి బయట రేకులషెడ్డు కింద రెండు మంచాలలో నిద్రపోతున్న దీపిక, దీపిక తల్లి బానోతు సుగుణ, తండ్రి శ్రీనులపై తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఇంట్లో నిద్రిస్తున్న దీపిక తమ్ముడు మదన్‌లాల్ మెడపై కత్తితో వేటు వేశాడు. ఈ దాడిలో సుగుణ అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీను నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చనిపోయాడు. భయంతో మదన్‌లాల్, దీపికలు పారిపోయారు. ఇంతలో చుట్టుపక్కలవారు రావడంతో నాగరాజు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ విషయంపై మృతుడు శ్రీను తల్లి ఈరమ్మ చేసిన ఫిర్యాదుతో నిందితుడు మేకల నాగరాజు అలియాస్ బన్నీపై కేసు నమోదు చేశారు. ఈనెల 11న నెక్కొండ సీఐ సిబ్బందితో హనుమకొండలోని వడ్డెపల్లి జంక్షన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, నెక్కొండ సీఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ రైస్‌ను అందుబాటులో ఉంచాలి..



ఫోర్టిఫైడ్ రైస్ తయారీ విధానంపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వినియోగదారుల ప్రతినిధులు

కాళోజీ జంక్షన్, జూలై 12: ప్రభుత్వం ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలందరికీ సంపూర్ణ పౌష్టికాహారం అందించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ విధానంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతోపాటు పౌర సరఫరాల శాఖలో సమన్వయ లోపం వల్ల నాసిరకం బియ్యం పంపిణీ జరుగుతోందని దామోదర్ అన్నారు. ప్రభుత్వ చౌక డిపోలు, ప్రభుత్వ బియ్యం గోదాముల ద్వారా వినియోగదారులకు ప్రభుత్వ హాస్టళ్లకు సరఫరా అవుతున్న క్రమంలో అవాంతరాల వల్ల ఆహార కల్తీ సమస్యలు ఏర్పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. ఫోర్టిఫైడ్ రైస్ విధానంపై రాష్ట్రవ్యాప్తంగా ఆహార సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆహార కల్తీ నిరోధక శాఖ ఫోర్టిఫైడ్ రైస్ లైసెన్స్ జారీ వరకే పరిమితం కాకుండా నిరంతర నిఘా పెట్టాలని అన్నారు. సమావేశంలో ఫోర్టిఫైడ్ రైస్ తయారీపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇంకా నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమసమితి ప్రతినిధులు పెండోట అనిల్‌కుమార్, సందు ప్రవీణ్, గైనీ రత్నాకర్, వినియోగదారుల మండలి ప్రతినిధులు రావుల రంజిత్‌కుమార్, ఎర్ర అశోక్‌కుమార్, కల్యాణపు శ్యాంసుందర్ పాల్గొని మాట్లాడారు.

మంత్రి సురేఖను కలిసిన ఆర్టీసీ ఆర్ఎం

బాలసముద్రం, జూలై 12: రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను ఆర్టీసీ ఆర్ఎం విజయభాను శుక్రవారం హనుమకొండలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వరంగల్ బస్టాండ్ నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని మంత్రిని కోరినట్లు ఆర్ఎం విజయభాను తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వరంగల్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ కె.భానుకిరణ్, హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరమ్‌సింగ్‌లు ఉన్నారు.



మంత్రి సురేఖకు పుష్పగుచ్ఛం అందిజేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం విజయభాను

పీడీఎస్ బియ్యం, గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, జూలై 12: పరకాల ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు. దాడుల్లో రూ.8లక్షల 26వేల పీడీఎస్ బియ్యం, రూ.1లక్ష 58వేల గుట్కాలు స్వాధీనం చేసుకున్నారు. భారీ స్థాయిలో పీడీఎస్ బియ్యం నిల్వలున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో పరకాలలో దాడులు చేశారు. పోలీసుల దాడుల్లో బండి కుమార్ వద్ద రూ.2లక్షల 80వేల బియ్యం, బండి శంకర్ వద్ద రూ.2లక్షల 8వేల బియ్యం, టి.ఐలయ్య వద్ద రూ.3లక్షల 38వేల బియ్యంతోపాటు ఆర్.చంద్రశేఖర్ వద్ద రూ.1లక్ష 58వేల గుట్కాలను స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం స్థానిక పోలీసులు నలుగురిని అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ నిస్సార్‌పాషా, ఏఎస్సై పీవీరావు, కానిస్టేబుళ్లు కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పట్టుబడ్డ పీడీఎస్ బియ్యంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు



చెత్తలో ఉన్న అధికారుల చిత్రపటాలు

చాంబర్‌కు వాస్తు దోషం!

ఎంజీఎంలో అధికారుల ఆఫీసుల మార్పు

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రోగులు

చెత్త బుట్టలోకి పాత సూపరింటెండెంట్ల చిత్రపటాలు

వరంగల్ మెడికల్, జూలై 12: ఎంజీఎం సూపరింటెండెంట్ చాంబర్‌కు వాస్తు దోషం పట్టుకుంది. దీంతో సూపరిం టెండెంట్ పలు కార్యాలయాల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఏకంగా రూ.50లక్షల ప్రజాధనంతో నూతన హంగులతో చాంబర్ ఏర్పాటు చేసుకున్నారు. పాత చాంబర్ బాగానే ఉన్నప్పటికీ వాస్తు పేరుతో డెర్మటాలజీ విభాగంలో ఓపీ విభాగం మరో చోటికి మార్చి మరీ చాంబర్ ఏర్పరుచుకున్నారు. అదే విధంగా ఆర్ఎంవో గదులను కూడా నూతనంగా ఏర్పాటు చేశారు. దీంతో పరిపాలన కార్యాలయాన్ని మరోచోట, వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు మరోచోట ఉండటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాగే సెక్షన్లు ఒకచోట.. అధికారులు మరో చోట ఉండటంతో అధికారుల సంతకాల కోసం అక్కడిదాకా వెళ్లాల్సి వస్తోంది. ఎంజీఎంలో కనీస వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతుంటే.. ఉన్నతాధికారి మాత్రం ఇన్ని హంగులతో చాంబర్ ఏర్పాటు చేసుకోవడం అవసరమా..? అని రోగులు ప్రశ్నిస్తున్నారు.

చెత్త కుప్పలో చిత్రపటాలు

ఎంజీఎం ఆస్పత్రిలో పాత సూపరింటెండెంట్‌లకు అవమానం జరిగింది. వారి చిత్రపటాలను చెత్తబుట్టలో పడేశారు. ఎంజీఎం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైద్యాధికారుల చిత్రపటాలను అలా పడేయడంపై సిబ్బంది, రోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు పని చేసిన సూపరింటెండెంట్ల ఫొటోలను సూపరింటెండెంట్ చాంబర్‌లో ఏర్పాటు చేసే ఆనవాయితీ ఉంది. అయితే చాంబర్ ఆధునీకరణ పేరుతో ఈ ఫొటోలను అన్నింటినీ చెత్తబుట్టలో వేశారు. ఎవరు, ఎంతకాలం పనిచేశారనే బోర్డులను కూడా తొలగించారు. ఎంజీఎంకు అమూల్యమైన సేవలు అందించిన ఉన్నతాధికారుల ఫొటోల పట్ల నిర్లక్ష్యం తగదని ఆ శాఖ ఉద్యోగులు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆ చిత్రపటాలను చాంబర్‌లో ఏర్పాటు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



హనుమకొండ చౌరస్తాలో ఏర్పడ్డ గుంతలు



వడ్డేపల్లి జంక్షన్ వద్ద 'వావ్ వరంగల్' లోగో ఎదుట ఏర్పడ్డ గుంతలు



హనుమకొండ బాలసముద్రం ఏకశిలా పార్కు వద్ద..



హనుమకొండ బస్‌స్టాండ్ వద్ద గుంతలు

గుంతల దారులు.. నగరవాసుల అవస్థలు..



కాజీపేట జంక్షన్‌లో అస్తవ్యస్తంగా..



ములుగురోడ్ జంక్షన్‌లో ఏర్పడ్డ గుంతలు

నగరం ఓ వైపు స్మార్ట్ సిటీగా అడుగులు వేస్తున్న సమయంలో నగర వాసులను గుంతలమయమైన రహదారులు అవస్థల పాలు చేస్తున్నాయి. వరంగల్ నుంచి కాజీపేట వరకు రోడ్లన్నీ అడుగుకో గుంతతో అధ్వానంగా, ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా జంక్షన్లలో ఏర్పడిన గుంతలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అసలే గుంతల రోడ్లపై ప్రయాణంగా కష్టంగా ఉందనుకుంటుంటే.. వర్షాలకు వాటిలో నీరు నిలిచి ఎక్కడ ఏ గతుకు ఉందో అర్థం కాక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, రూ.కోట్లలో నిధులు వెచ్చిస్తున్నామని చెబుతున్న పాలకులు, అధికారులకు తమ కష్టాలు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏబీవీపీ ప్రాంత సమితి సభ్యుడు రాజ్‌కుమార్

భూపాలపల్లిటౌన్, జూలై 12 : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జయశంకర్ జంక్షన్ వద్ద విద్యార్థులు శుక్రవారం నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ప్రాంత సమితి సభ్యుడు వేల్పుల రాజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వీపర్లుగా పనిచేయాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాజ్‌కుమార్ డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తరుణ్, అఖిల్, అనూప్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు అవగాహన

వెంకటాపురం(నూగూరు), జూలై 12 : మండలంలోని ఆలుబాక జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకట్రావ్ పిల్లల హక్కులు, పార్లమెంట్ ఉపయోగాలపై వివరించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు గొంది హనుమంతు, కామేష్, ప్రశాంత్, ఉష, నరేష్, ఇందిర, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవ గొప్ప వరం

ప్రజాప్రతినిధుల వీడ్కోలు కార్యక్రమంలో ఎంపీడీవో రాజు



తాజా మాజీ సర్పంచ్, వార్డుసభ్యులను సన్మానిస్తున్న అధికారులు

వెంకటాపూర్(రామప్ప), జూలై 12 : సమాజంలో ప్రజాసేవ చేయడం గొప్ప వరమని ఎంపీడీవో రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్, వార్డు సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం జరగగా ఎంపీడీవో రాజు పాల్గొని మాట్లాడారు. గ్రామ స్వరాజ్యానికి స్థానిక సంస్థలు పట్టుకొమ్మలని అన్నారు. గ్రామాభివృద్ధి చేసిన పాలకవర్గాన్ని స్థానికులు గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారికి సేవ చేయడం వరం లాంటిదని పేర్కొన్నారు. తాజా మాజీ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలం సంతృప్తినిచ్చిందని, భవిష్యత్‌లో కూడా ప్రజాసేవ చేయడమే తన లక్ష్యమని అన్నారు. అనంతరం అధికారులు తాజా మాజీ సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి దామోదర్, ఎంపీటీసీలు శ్రీలత, అనిత, మేడారం ట్రస్టు బోర్డు డైరెక్టర్ మిల్కూరి ఐలయ్య, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పోశాల వీరమల్లు, మాజీ కోఆప్షన్ సభ్యుడు జహీర్, గ్రామపెద్దలు జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, కూరెళ్ల రామాచారి తదితరులు పాల్గొన్నారు.

'పుట్ట మధు చిల్లర రాజకీయాలు మానుకోవాలి'

కాటారం, జూలై 12 : బీఆర్‌ఎస్ నేత పుట్ట మధు చిల్లర రాజకీయాలు మానుకోవాలని, మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు పుట్ట మధును ఒక్కసారి గెలిపిస్తే అక్రమదందాలు చేసి వందల కోట్లు సంపాదించడమే కాకుండా నియోజకవర్గంలో రౌడీ, గుండా రాజ్యం తెచ్చిన ఘనత ఆయనకే దక్కిందని దుయ్యబట్టారు. నియోజకవర్గంలో ఏ సంఘటన జరిగినా మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుకు ఆపాదించడం చూస్తుంటే మతితప్పి మాట్లాడుతున్నారనే అనుమానం కలుగుతుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు 7 నెలల కాలంలోనే వందల కోట్ల నిధులుతెచ్చి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని, పుట్ట మధు అసత్య ఆరోపణలు చేస్తూ రాజకీయ ఉనికిని కాపాడుకోవాలనే దురాలోచన చేస్తున్నాడని మండిపడ్డారు. నాయకులు భూపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏడో రోజుకు చేరిన అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలు

ములుగు కలెక్టరేట్, జూలై 12 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు ములుగులోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రేమకుమారి మాట్లాడుతూ 65 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష పెన్షన్ అందించాలని, జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని, 65ఏళ్లు దాటిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో అంగన్‌వాడీలు సరిత, సూరమ్మ, వెంకటేశ్వరి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా ఇళ్ల నిర్మాణాలు

పట్టించుకోని అధికారులు



రేగులగూడెం శివారులో అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణం

కాటారం, జూలై 12: మండలకేంద్రంతో సహా పలు రెవెన్యూ గ్రామాల పరిధిలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. గారెపల్లి, దేవరాంపల్లి, కాటారం, పోతులవా యి, రేగులగూడెం, మేడిపల్లి, కంబాల్‌పాడ్, ధన్వాడ రెవెన్యూ గ్రామ శివారుల్లో ఇళ్లను నిర్మిస్తున్నారు. కొందరు అసైన్డ్‌దారులు తమ భూముల్లో ఇళ్లు నిర్మిస్తుండగా, మరికొందరు లావణి, అసైన్డ్ భూములను కొనుగోలు చేసి యథేచ్ఛగా ఇళ్ల నిర్మాణం సాగిస్తున్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వానికి భూములు అవసరమైతే భూతద్దంతో వెదికినా గుంట జాగా కనిపించకుండా పోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మండల కేంద్రమైన గారెపల్లిలో భూముల ధరలకు రెక్కలు రావడంతో అసైన్డ్ భూముల్లోనూ ఇళ్ల నిర్మాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. పీవోటీ యాక్టుముందు అసైన్డ్ అయిన భూముల్లోనూ ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఏం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నాలుగు మండలాలకు కూడలి అయిన కాటారం మండలకేంద్రం శివారులో రోడ్ల పక్కన వ్యవసాయ భూముల్లో సైతం ఇళ్ల నిర్మాణాలు జరుతున్నాయి. నాలా పన్ను కట్టి వ్యవసాయేతర భూములుగా కన్వర్షన్ చేయించకుండానే పెద్ద భవంతులు నిర్మిస్తున్నారు. గారెపల్లి శివారులోని సర్వే నెంబర్లు 128, 130, 131, 132, 41, కాటారం శివారులోని 58, 71, రేగులగూడెం శివారులోని సర్వే నెంబర్లు 176, 180, 132 181లలో, దేవరాంపల్లి శివారులోని 248, 245, పోతులవాయి శివారులోని సర్వే నెంబర్లు 254, 257లలోని అసైన్డ్ భూముల్లో ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇళ్ల నిర్మాణం విషయమై తహసీల్దార్ నాగరాజును అడుగగా తన దృష్టికి వచ్చిన వారిపై కేసులు నమోదు చేశామని, ఇళ్ల నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రామప్ప దేవాలయాన్ని సందర్శించిన ఓఎస్డీ

వెంకటాపూర్(రామప్ప), జూలై 12 : మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శుక్రవారం ములుగు ఓఎస్డీ మహేష్ బాబాసాహెబ్ గీతే శుక్రవారం సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనను సాదరంగా ఆహ్వానించగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ శిల్పకళా నైపుణ్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట స్థానిక ఎస్సై సతీష్ తదితరులు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

మల్లూర్, జూలై 12 : ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రమైన తాడిచర్లలో శుక్రవారం చోటు చేసుకుంది. కొయ్యూర్ ఎస్సై నరేష్ తెలిపిన ప్రకారం.. తాడిచర్ల గ్రామానికి చెందిన మేనం నరేష్(26) స్థానిక ఓసీపీలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నరేష్ ఇటీవలే వైద్యం కోసం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి వెళ్లినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఉరి వేసుకొని చనిపోయినట్లు తెలిపారు. సోదరుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, జూలై 12 : ములుగులోని మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ ఉద్యోగానికి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 15 నుంచి 24వ తేదీ లోపు సంబంధిత ధ్రువ పత్రాలపై గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేయించి ములుగులోని మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రేగొండ, జూలై 12 : మండలంలోని రంగయ్యపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మల్లయ్య కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు శుక్రవారం పరామర్శించారు. మృతుడి కుమారుడు సీనియర్ జర్నలిస్టు లక్ష్మీనారాయణను ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

కాకతీయఖని, జూలై 12: ది కాకతీయఖని లారీ డ్రైవర్స్ అసోసియేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వీరస్వామి, కార్యదర్శిగా సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగారమేష్, కోశాధికారిగా పూర్ణచందర్, జాయింట్ సెక్రటరీగా సంపత్ ఎన్నికయ్యారు.

ముంపు ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

వెంకటాపురం(నూగూరు), జూలై 12 : గోదావరి వరద ముంపు ప్రాంతాల ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ మండల కార్యదర్శి విజయ్ మాట్లాడారు. వెంగళరావుపేట, టేకులబోరు, తుర్సవానిగూడెం గ్రామాలు ప్రతి వర్షాకాలంలో గోదావరి వరద ముంపుకు గురవుతున్నాయని అన్నారు. అధికారులు ముంపు గ్రామాల సమస్యలపై దృష్టి సారించి వారిని వేరే ప్రాంతాలకు తరలించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోగిల శ్రీను, నరేంద్ర, రవికుమార్, ముత్తయ్య, నాగేశ్వర్‌రావు, సురేష్, ప్రజలు పాల్గొన్నారు.

గుడిసెలు తొలగించేందుకు అధికారుల యత్నం

అడ్డుకున్న గుడిసెవాసులు.. ఇరువర్గాల మధ్య వాగ్వాదం



రెవెన్యూ అధికారులను అడ్డుకుంటున్న గుడిసెవాసులు

వాజేడు, జూలై 12: ప్రభుత్వ భూమిలో వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు యత్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మండలంలోని మండపాక మిషన్ భగీరథ పంప్‌హౌస్ సమీపంలో కొన్ని రోజుల క్రితం ప్రభుత్వ భూమిలో అరుణాచలపురం, చంద్రుపట్ల, కొంగాలకు చెందిన పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈక్రమంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది అక్కడికి చేరుకొని గుడిసెలను తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో గుడిసెవాసులకు, రెవెన్యూ అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వరదల సమయంలో తమ ఇళ్లు మునిగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఉంటే తమను పట్టించుకోకపోతే గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తుంటే అధికారులు తొలగించడం ఏంటని నిలదీశారు. అధికారులు మాత్రం ఇవి కొత్తగా వేసిన గుడిసెలు అని, ఎట్టి పరిస్థితుల్లో తొలగించాల్సిందేనంటూ పట్టుబట్టారు. గుడిసెలను తొలగించేందుకు అధికారులు యత్నించగా గుడిసెవాసులు ప్రతిఘటించారు. దీంతో సమాచారం అందుకున్న వాజేడు ఎస్సై రుద్రారపు హరీష్ సంఘటన స్థలంకు చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. జిల్లా అధికారులకు గుడిసెవాసులు దరఖాస్తు చేసుకోవాలని, అప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని, వేసిన గుడిసెలు తొలగించవద్దని అధికారులకు సూచించారు. దీంతో గుడిసెవాసులు శాంతించారు. ప్రభుత్వం న్యాయం చేయాలని గుడిసెవాసులు మీడియా ముందు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి : కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 12 : జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ అక్రమ ఇసుక రవాణా, అధి క లోడ్, ఇసుక పాలసీపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో జిల్లా వ్యాప్తంగా వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణావల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అతివేగం, ఓవర్‌లోడ్, సరైన వేబిల్లులు లేకుండా నడిపితే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా రాత్రి వేళల్లో పటిష్ఠ పహారా ఉంచి ఇసుక రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలకు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరాకు జీవో 3 ప్రకారం పంచాయతీ కార్యదర్శులకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక రీచ్‌లను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి

కాకతీయఖని, జూలై 12 : సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని విరమించుకుని సింగరేణికి కేటాయించాలని సీపీఐ భూపాలపల్లి పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం సీపీఐ, ఏఐవైఎఫ్, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జోసఫ్, వెంకటేష్, కాంతారావు, లావణ్య, రవికాంత్, యాకూబ్‌పాషా, సాకేత్‌రెడ్డి, రక్షిత, రమేష్ పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్ష గందరగోళం

ఉదయం మేడ్చల్ మల్కాజ్‌గిరి, మధ్యాహ్నం హనుమకొండలో పరీక్ష

ఆందోళనలో అభ్యర్థి



అభ్యర్థి హాల్‌టికెట్

చిట్యాల, జూలై 12 : డీఎస్సీ పరీక్ష నిర్వహణలో గందరగోళం నెలకొంది. పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు సమయం ఇవ్వాలని కొంతమంది నిరుద్యోగులు కొద్దిరోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారమే డీఎస్సీ పరీక్షను నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీ ప్రకటన చేసి ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లను విడుదల చేసింది. చిట్యాల మండలం కైలాపూర్ గ్రామానికి చెందిన పాశిగంటి సురేందర్‌కు ఒకే రోజు రెండు చోట్ల పరీక్షలకు హాజరు కావాలని హాల్‌టికెట్లు రావడం పట్ల సదరు విద్యార్థి ఆందోళన చెందుతున్నాడు. సెకండరీ గ్రేడ్ టీచర్(స్పెషల్ ఎడ్యుకేషన్) పోస్టుకు ఈనెల 20న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా సీఎంఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష ఉంది. స్కూల్ అసిస్టెంట్(స్పెషల్ ఎడ్యుకేషన్) పరీక్ష అదేరోజు మధ్యాహ్నం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి శివారులో ఐఓఎన్ డిజిటల్ జోన్ ఎర్రగట్టుగుట్ట పరీక్ష కేంద్రంలో హాజరుకావాలని హాల్‌టికెట్లు వచ్చాయి. దీంతో గంటన్నర సమయంలో సుమారు 150 కిలోమీటర్ల ప్రయాణం ఎలా సాధ్యమవుతుందని అభ్యర్థి ఆందోళన చెందుతున్నాడు. సంబంధిత అధికారులు స్పందించి పరీక్ష తేదీలు మార్చేవిధంగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థి సురేందర్ వేడుకొంటున్నాడు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

15 మందికి గాయాలు





ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, లారీ గాయపడిన ప్రయాణికులు

ములుగు రూరల్ జూలై 12: లారీ, ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన సంఘటనలో 15 మంది ప్రయాణికులు, కండక్టర్‌కు గాయాలయ్యాయి. ఈ సంఘటన ములుగు జిల్లా ములుగు మండలం పందికుంట-మల్లంపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగింది. ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది తెలిపిన ప్రకారం...ములుగు నుంచి హనుమకొండకు 33మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు(టీఎస్ 03 యూబీ 6688) వెళ్తుంది. ఈక్రమంలో పందికుంట-మల్లంపల్లి గ్రామాల మధ్యకు బస్సు చేరుకోగానే లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులు, కండక్టర్‌కు గాయాలయ్యాయి. వారిని 108లో ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వన్‌వే ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలు వన్‌వే నుంచి వెళ్తున్న క్రమంలో బస్సు డ్రైవర్ ఇండికేషన్ ఇచ్చినా లారీ డ్రైవర్ గమనించకుండా ఎదురుగా వచ్చి బస్సును ఢీకొట్టినట్లు ఆర్టీసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను. డిప్యూటీ ఆర్ఎం కె.భానుకిరణ్, వరంగల్-2 డిపో మేనేజర్ సురేష్, డిపో-1 మేనేజర్ మోహనరావు, అసిస్టెంట్‌మేనేజర్ జోత్స్న సంఘటన వివరాలు తెలుసుకుని ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డుపై నిలిచి ఉన్న లారీలు

మా గ్రామాలకు వెళ్లేదెలా..!

ఇష్టారాజ్యంగా ఇసుక లారీల ప్రయాణం

మహదేవపూర్, జూలై 12 : మండలంలోని పలుగుల, మద్దులపల్లి తదితర గ్రామాలకు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూస్కుపల్లి, పలుగుల, కుంట్లం తదితర గ్రామాల్లో ఇసుక కోసం క్వారీలకు వెళ్లే, ఇసుక లోడింగ్ తర్వాత వచ్చే లారీలు రోడ్లన్నీ ఆక్రమించడంతో తాము ఇతర గ్రామాలకు వెళ్లడానికి, గ్రామంలోకి రావడానికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు, టీఎస్ఎండీసీ అధికారులకు తెలిపినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

మొగుళ్లపల్లి, జూలై 12: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ యూనిట్‌ను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు పి.విజయ్‌పాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఎన్‌సీసీ యూనిట్ సభ్యులకు ఎన్‌సీసీ ఆఫీసర్ గుండెల్లి రాజయ్య శిక్షణ ఇవ్వనున్నారని అన్నారు. ఎన్‌సీసీ ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసంతోపాటు దేశభక్తి, ఆర్మీ జీవితం, క్రమశిక్షణ, ఆయుధాల వినియోగం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందని తెలిపారు. అనంతరం ఎన్‌సీసీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హవల్దార్ బాషా, హవల్దార్ సందీప్, ఉపాధ్యాయులు భాగ్యశ్రీ, టి.వెంకన్న, వై.సురేందర్, కళ్యాణి, అనిల్‌కుమార్, ఎం.రాజు, బికుమారస్వామి, ప్రవీణ్, డి.పద్మ, లలిత, విజయభాస్కర్, శ్రీకళ, చందర్, స్పందన పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, ఉపాధ్యాయులు

విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కావొద్దు



కాళేశ్వరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చక్రపాణి

మహదేవపూర్, జూలై 12 : విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కావొద్దని కాళేశ్వరం ఎస్సై చక్రపాణి అన్నారు. మండలంలోని కాళేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్సై ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై చక్రపాణి మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి పాలిట పడి విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. క్షణికానందానికి పోయి భవిష్యత్‌ను ఆగం చేసుకోవద్దని అన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినట్లు చూసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు మంచి ఆలోచనలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఏటూరునాగారం రూరల్ : మత్తు పదార్థాలతోపాటు చట్టవ్యతిరేక పనులకు యువత దూరంగా ఉండాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. శుక్రవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్‌తో ప్రత్యేక సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గంజాయి, డ్రగ్ వంటి మత్తుపదార్థాలను సేవించడం వల్ల అనేక రకాలుగా అనారోగ్యంబారిన పడతారని, యువత అటువంటి చెడు అలవాట్లను అలవర్చుకోవద్దని సూచించారు. అంతేకాకుండా బోనఫిక్స్‌ను మత్తు పదార్థంగా వినియోగిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందని, నిర్మానుష్య ప్రాంతంలో కొందరు యువకులు బోనఫిక్స్‌ను తీసుకుంటున్నారని, వాటితో ఊపిరితిత్తులు చెడిపోయే అవకాశం ఉందని, వాటికి దూరంగా ఉండాలన్నారు. షాపుల వద్దకు ఎవరైనా బోనఫిక్స్ కొనుగోలు చేయడానికి వస్తే వారి ఫొటోలను తీసుకుని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అన్నారం వద్ద కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్, జూలై 12 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం వద్ద నిర్మించిన సరస్వతీ బ్యారేజీకి గతంలో బుంగలు పడడంతో పూణే నుంచి వచ్చిన నిపుణుల బృందం జియోఫిజికల్ పరీక్షలను నిర్వహిస్తుంది.రెండో విడతలో భాగంగా డాక్టరు మందిరా ఆధ్వర్యంలో వచ్చిన నిపుణులు జియోఫిజికల్ టెస్టులు నిర్వహిస్తున్నారు. తమ బృందం పర్యటనలో భాగంగా ఐదో రోజైన శుక్రవారం అప్‌స్ట్రీమ్ పనులు పూర్తిచేశామని, 21 డ్రిల్‌లకు గాను 11 డ్రిల్స్ పూర్తి చేసి 11 టెస్టులకు 7 టెస్టులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. డౌన్ స్ట్రీమ్ పనులను ప్రారంభించినట్లు వివరించారు. కాగా, టెస్టుల ఫలితాలను విశ్లేషించి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు బృందం సభ్యులు వివరించారు.

మాటలు కలిపి.. మత్తుమందు ఇచ్చి..

తులం బంగారు గొలుసు అపహరించిన గుర్తుతెలియని యువకులు



వృద్ధురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై

వెంకటాపూర్(రామప్ప), జూలై 12: ఓ వృద్ధురాలితో మాయమాటలు కలిపి.. మత్తుమందు ఇచ్చి తులం బంగారు గొలుసు అపహరించారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని యువకులు దొంగతనానికి పాల్పడ్డారు. ఈ సంఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని సింగరకుంటపల్లి క్రాస్ వద్ద చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన ప్రకారం.. మండలంలోని సింగరకుంటపల్లి క్రాస్ వద్ద 70ఏళ్ల వృద్ధురాలు లింగాల రాజేశ్వరి నివాసం ఉంటుంది. గురువారం సాయంత్రం 6.30గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు గుర్తుతెలియని యువకులు అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో వర్షం పడడంతో రాజేశ్వరి ఇంటి ఆవరణలోకి వెళ్లారు. ఆమెతో కుశల ప్రశ్నలు వేస్తూ మాటలు కలిపారు. కొద్దిసేపటికి టీ చేయమని అడుగగా పాలు లేవని చెప్పడంతో ఓ యువకుడు బయటకు వెళ్లి పాల ప్యాకెట్ తీసుకువచ్చాడు. టీ తాగుతూ కాస్త జ్వరంగా ఉందని ఆ వృద్ధురాలు వారితో చెప్పింది. ఓ యువకుడు వెంటనే ఓఆర్ఎస్ తీసుకువచ్చాడు. అందులో మత్తుమందు కలిపి ఆ వృద్ధురాలికి ఇచ్చాడు. కొన్ని నిమిషాల్లోనే వృద్ధురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఇద్దరు యువకులు ఆమె మెడలోఉన్న తులం బంగారు గొలుసు తీసుకుని పరారీ అయ్యారు. రాత్రి 9గంటలకు మెలకువ వచ్చిన రాజేశ్వరి ఒంటిపై చూసుకోగా బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో ఆమె పక్కనే ఉన్న తన తమ్ముడికి విషయం చెప్పింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం వృద్ధురాలు రాజేశ్వరి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

అక్రమ ఇళ్ల నిర్మాణాల అడ్డగింత

కాటారం, జూలై 12 : మండల కేంద్రంలో అనుమతులు లేకుండా లావణి పట్టా భూముల్లో అక్రమంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో ఉపేంద్రయ్యల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సమీర్‌ఖాన్ ఆధ్వర్యంలో సిబ్బంది, వీఆర్ఏలు ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుని పనిముట్లు, సామగ్రిని జీపీ కార్యాలయానికి తరలించారు. ఇళ్ల నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రక్తచరిత్ర

(3వ పేజీ తరువాయి)

ముగ్గురు పిల్లలను అనాథలుగా చేసిందనే చర్చ జరుగుతోంది.

భూవివాదంలో..

జూలై 1వ తేదీ రాత్రి రాయపర్తి మండలం బురాహన్‌పల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్‌పై అదే గ్రామానికి చెందిన పల్లె మల్లేష్, అతడి అనుచరులు భూతగాదాలతో దాడికి పాల్పడ్డారు. మూడు ఎకరాల భూమి విషయంలో వివాదం ఉండటంతో సుత్తెతో తలపై బాదటంతో అక్కడిక్కడే దేవేందర్ మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. ప్రస్తుతంనిందితులు పోలీసులఅదుపులో ఉన్నారు.

పోలీసుల నజర్

వరుసగా జరుగుతున్న హత్యలు, దాడులపై పోలీసులు నజర్ వేస్తున్నారు. నేరాలను అరికట్టేందుకు పోలీసులు నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయటం, అదుపులోకి తీసుకోవటం చేస్తున్నారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా స్వయంగా అర్ధరాత్రి కూడా నగరంలోని పలు పోలీస్‌స్టేషన్‌లను తనిఖీలు చేస్తూ పోలీసులను అప్రమత్తం చేస్తున్నారు. అయినప్పటికీ హత్యలు, దాడులకు బ్రేక్ పడటం లేదు. ముఖ్యంగా నగరంలోని మిల్స్‌కాలనీ ప్రాంతంలో విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ లభిస్తుందనే ప్రచారం జరుగుతోంది. నేరాలకు ఇవి కూడా ప్రధానం కావటంతో పోలీసులు వీటిపై కూడా దృష్టి పెట్టాలని, రాత్రిళ్ల పోలీసుపెట్రోలింగ్‌లను పెంచాలని ప్రజలువిజ్ఞప్తి చేస్తున్నారు.